# సుశీలమ్మ సేవలు అభినందనీయం



ఉద్యోగ విరమణ పొందిన సుశీలమ్మను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ సాయన్న, సిబ్బంది

ఎదులాపురం, మార్చి 30 : చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వకుండా 33ఏళ్లు సుశీలమ్మ అందించిన సేవలు అభినందనీయమని డీఆర్డీవో సాయన్న అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఏర సుశీలను శనివారం ఆ కార్యాలయంలో సన్మానించారు. అనంతరం మర్యాదపూర్వకంగా డీఆర్‌డీవో వాహనంలో ఇంటి వద్దకు సాగనంపి వీడ్కోలు పలికారు. సుశీలమ్మ ఉత్తమ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీడీ జాదవ్ శేషారావ్, ఏవో సంజయ్‌కుమార్, డీపీఎంలు గంగన్న, హేమలత, శోభారాణి, సుగంధ, ఉద్యోగులు కిరణ్ కుమార్, ప్రకాశ్, కిరణ్, సవిత, లత, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ ఆలోచనలతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ కాశీనాథ్

తాంసి(భీంపూర్), మార్చి 30 : శాస్త్రీయ ఆలోచనలతోనే దేశాభివృద్ధి చెందుతుందని నేషనల్ ఇన్సిట్యూట్ ఫర్ టెక్నాలజీ, వరంగల్‌లోని రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కాశీనాథ్ అన్నారు. శనివారం భీంపూర్ మండలం నిపాని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ ఆవిష్కార్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రీయ దృక్పథం , సైన్స్‌లోని ఆవిష్కరణలు, విద్యార్థులకు భవిష్యత్‌లో రాబోయే అవకాశాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు, సైన్స్ ముగ్గుల పోటీలను ప్రారంభించారు. సైన్స్‌పై వారి అభిరుచిని, ఆ దిశగా ముగ్గుల పోటీలను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను కొనియాడారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఆవిష్కరించాలంటే విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను తమ జీవనంలో భాగం చేసుకోవాలని, ప్రతి అంశాన్ని పరిశీలన, ప్రశ్నల ద్వారా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిప్పల్‌కోటి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయుడు సంతోష్ బేదొడ్కర్, ఉపాధ్యాయులు బాపురావ్, గంగయ్య, మాలవిక శాస్త్రి, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నియామక పత్రాలు అందజేత




నియామక పత్రాలు అందుకున్న జిల్లా కమిటీ సభ్యులతో అధ్యక్షుడు చంద్రశేఖర్

ఎదులాపురం, మార్చి 30 : నేషనల్ హ్యూమన్ రైట్స్, సామాజిక న్యాయం, సామాజిక సేవలు, భారతదేశ మర్పు కోసం పని చేస్తున్నదని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు జాతీయ అధ్యక్షుడు మంగళంపెల్లి హుస్సేన్ ఆదేశాల మేరకు నియామకపత్రాలు అందజేశామని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. మహిళా రక్షణ కమిటీ ఉపాధ్యక్షురాలిగా కే రాధ, ఆదిలాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా గంట ప్రమోద్‌కుమార్, జాయింట్ కార్యదర్శిగా సునంద, కార్యనిర్వాహక సభ్యుడిగా సీహెచ్ విశాల్ సింగ్, జనరల్ సెక్రటరీగా ఎం కవితను నియమిస్తున్నట్లు నియామకపత్రాలు అందజేశారు. ఎక్కడ మానవ హక్కుల ఉల్లంఘన జరిగిన తమ దృష్టికి తీసుకువస్తే బాధితులకు అండగా ఉంటూ న్యాయం చేస్తామని తెలిపారు.

# సమస్యల్లో చాప్రాల గ్రామం

- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులు



చాప్రాల గ్రామం

ఉట్నూర్, మార్చి30 : ఉట్నూర్ మండలం చాప్రాల గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం ఏర్పడి సంవత్సరాలు గుడుస్తున్న అధికారులు కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్డు, వైద్యం, పాఠశాల వసతులు కల్పించలేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక కాలినడకనే వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన 104, 108 వాహనాలు రోడ్డు లేకపోవడంతో తమకు అందని ద్రాక్షలాగే మిగిలింది. వ్యాధుల బారిన పడిన వారికి నాటు వైద్యం తప్పా సర్కారు వైద్యం అందడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దట్టమైన అడవి కావడంతో నివాసం ఉంటున్న 20 కుటుంబాలు అడవి పందులు, ఎలుగుబంట్ల లాంటి వాటితో ప్రమాదం పొంచి ఉండడంతో భయాందోళన మధ్య జీవిస్తున్నారు. గతంలో ఎలుగుబంటి దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరుబావులు పని చేయకపోవడంతో దూరంలో ఉన్న వాగుల వద్ద చెలిమలు తవ్వుకొని నీటిని తెచ్చుకుంటున్నారు. అవి కూడా వేసవి కాలంలో ఎండిపోయి నీటి ఎద్దడి నెలకొంటుంది. నీటి కోసం కిలోమీటర్ల మేరా వెళ్లాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. తమకు ఐటీడీఏ అధికారులు తాగునీటి పథకాలు, రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఉట్నూర్ నుంచి రాకపోకలు మెరుగుపడతాయని వారు అంటున్నారు.



చాప్రాల గ్రామానికి వెళ్లే దారి

## ఐటీడీఏ పండ్ల తోటలకు వేలం

ఉట్నూర్, మార్చి 30 : ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే పండ్ల తోటలకు వేలం వేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా తెలిపారు. శనివారం ఉట్నూర్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ఉద్యానవన నర్సరీ(హెచ్ఎన్‌టీసీ)లో పెంచిన జామ, మామిడి పండ్ల తోటలకు ఏప్రిల్ 6వ తేదీన అక్కడే సాయంత్రం 3 గంటలకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు హర్టికల్చర్ ఆఫీసర్ సుధీర్ కుమార్ 9032313933 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## మక్క పంట క్షేత్ర ప్రదర్శన



రైతును సన్మానిస్తున్న కంపెనీ ప్రతినిధులు, రైతులు

బోథ్, మార్చి 30: పట్నాపూర్ గ్రామంలో నూజివీడ్ సీడ్స్ కంపెనీ చెందిన మక్క (ఎన్ఎంహెచ్-8352) అనే రకాన్ని సాగు చేసిన పెందూర్ సోనేరావ్ రైతు పొలంలో శనివారం క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు పంటను తిలకించడానికి ఇక్కడి ఇచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ మిగతా హైబ్రిడ్ రకాల కంటే ఈ రకం మక్కలో అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం రైతును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సెల్స్ ఆఫీసర్ మహేందర్, రైతులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

బోథ్, మార్చి 30 : మండలకేంద్రంలో మీర్ ఇర్షాద్ అలీ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులతో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మీర్ ఇర్షాద్ అలీ పేర్కొన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై విస్తృతంగా ప్రచారం చేయాలి




మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 30 : ఎన్నికల్లో యువత వంద శాతం ఓటు నమోదు చేసుకొని, ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్వీప్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్వీప్ కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఓటు హక్కుపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ఓటు ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం తీసుకురావాలని సూచించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయాలని, పోలింగ్ కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలకు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, స్వీప్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎంసీసీ కచ్చితంగా అమలు చేపట్టాలి

మోడల్ కోడ్ కండక్ట్(ఎంసీసీ) ఎన్నికల నియమ నిబంధనలు కచ్చితంగా అమలు జరిగేలా ఎన్నికల అధికారులు ప్రతి అంశాన్ని పరిగణలోనికి తీసుకొని ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకసభ ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం ప్రలోభాలను నియంత్రించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలలో పట్టుబడిన నగదుకు రసీదు అందించి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందజేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమ నిబంధనలు అనుసరించి చెక్‌పోస్టుల్లో అన్ని రకాల వాహనాల తనిఖీలు నిర్వహించడం , బార్డర్ చెక్‌పోస్టుల్లో తనిఖీలు పకడ్బందీగా 24 గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ నిఘాలో ఉన్నాయని తెలిపారు. ఎస్ఎస్‌టీ టీంలు 18, ఎఫ్ఎస్‌టీ టీంలు 21 జిల్లాలో పని చేస్తున్నాయని, షిఫ్టుల వారీగా 24 గంటల పాటు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. ఎంసీసీ ద్వారా లిక్కర్ అండ్ క్యాష్ శనివారం వరకు ఎస్ఎస్‌టీ నుంచి రూ.3లక్షలు, ఎఫ్ఎస్‌టీ నుంచి రూ.2.73లక్షలు, మొత్తం రూ.5,73,000 సీజ్ చేయడం జరిగిందన్నారు. పోలీస్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో రూ.12,11,102కు సంబంధించిన 333 7.68 లీటర్ల లిక్కర్ సీజ్ చేయడం జరిగిందన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి(భీంపూర్), మార్చి 30: భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామానికి చెందిన సౌకత్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. బీఆర్ఎస్‌ను వీడి వెళ్లిన వారు బాధపడే రోజు త్వరలోనే వస్తుందన్నారు. భారీ మెజార్టీతో ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గొల్లి రమాబాయి, జడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, నాయకులు నరేందర్, కపిల్, కల్చాప్ యాదవ్, బహుర్ అహ్మద్, అఫ్రోజ్ ఉన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, మార్చి 30 : వైరస్ వల్ల వచ్చే రోగాల నుంచి తమ పశువులకు కాపాడుకునేందుకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. శనివారం చించోలి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ Experienced Supervisors Needed.
1 year of Waterproofing Experience Required. Contact: Jaya Bharathi Constructions at 8790508663.
NT-10287-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి



ఇంద్రవెల్లిలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

ఇంద్రవెల్లి, మార్చి 30 : ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. శనివారం సాయంత్రం ఇంద్రవెల్లిలో లోకసభ ఎన్నికల దృష్ట్యా పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలోని అంజి, వడగాం చౌక్ నుంచి బజాగల్లి మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ప్రత్యేక బలగాలు, పోలీసులు బ్యాండ్ వాయిస్తూ కవాతు నిర్వహించి ప్రజలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్ఐ దుబ్బాక సునీల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్, మార్చి 30 : మండలంలోని కౌట(బీ), పొచ్చర, బోథ్ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాల్లో స్థానిక పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాము మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. రాబోయే ఎన్నికలు శాంతియుత వాతావరణంలో పూర్తయ్యేల సహకరించాలని కోరారు.



బోథ్: కౌట(బీ)లో..

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి




మాట్లాడుతున్న ఎంపీపీ కనక మోతుబాయి

నార్నూర్, మార్చి 30 : వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ కనక మోతుబాయి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆరుగురు ఎంపీటీసీలు, ఐదుగురు మండల శాఖ అధికారులు మాత్రమే హాజరు కాగా సాదాసీదాగా కొనసాగింది. విద్య, ఐసీడీఎస్, ఫారెస్టు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు మండల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భజలాలు ఇంకి పోవడంతో తాగునీటి సమస్య తలెత్తిన గ్రామాలను గుర్తించాలని, ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో జవహర్‌లాల్, ఎంపీవో ఆనంద్, వైస్ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఎంపీటీసీలు రేణుక, కళావతి, ఏత్మాబాయి, అబేదాఖానామ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, ఎంఈవో ఆశన్న, ఐసీడీఎస్ సీడీపీవో శారద, ఈజీఎస్ ఏపీవో సురేశ్, బీట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్ రూరల్, మార్చి 30 : మండలంలోని లక్షెట్టిపేట గ్రామానికి చెందిన ఆర్క వినోద్ (23) ఒంటరి తనం భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. వినోద్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కుటుంబ సభ్యులు శుభకార్యానికి వెళ్లారు. సాయింత్రం తిరిగి ఇంటికి రావడంతో ఒంటరిగా ఉన్న వినోద్ దూలానికి ఉరేసుకొని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుని అన్న గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కానిస్టేబుల్ శిక్షణ కేంద్రం సందర్శన



భోజనశాల పరిశుభ్రతను పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మార్చి 30 : ఆదిలాబాద్ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 260 మంది సివిల్ కానిస్టేబుళ్లకు అందిస్తున్న శిక్షణను శనివారం ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించారు. శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుళ్లకు అందిస్తున్న భోజన సదుపాయాలు, భోజనశాల పరిశుభ్రతను, సరుకుల నాణ్యతను పరిశీలించారు. కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన సదుపాయాల నాణ్యతను కానిస్టేబుళ్లను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కేంద్రంలో ఐదు జిల్లాలకు సంబంధించిన సివిల్ కానిస్టేబుళ్లకు 9 నెలల పాటు శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా కానిస్టేబుల్ సీఆర్పీసీ, ఐపీసీ, పోలీస్ పరేడ్, ఆయుధాల పరిజ్ఞానం, సంఘవిద్రోహశక్తులతో పోరాటం, శారీరక దృఢత్వం తదితర అంశాలను కానిస్టేబుళ్లకు శిక్షణను అందించనున్నారు.

# విద్యార్థులకు బహుమతులు ప్రదానం



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న హెచ్ఎం మధుసూదన్

బోథ్, మార్చి 30 : సోనాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. మార్చి నెలలో 23 పని దినాలకు 23 రోజులు హాజరైన విద్యార్థులకు బహుమతులుగా వీటిని అందించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన

ఎదులాపురం, మార్చి 30 : పట్టణంలోని రాంనగర్ జడ్పీపీఎస్‌హెచ్ స్కూల్‌లో షీటీం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు సుశీల, సత్యమోహన్ మాట్లాడుతూ ఎవరైన పోకిరీలు మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన, ఇబ్బందులకు గురి చేసిన, వెంటపడి వేధించిన షీటీం నంబర్ 8712659953కు ఫోన్ చేయాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ , బాల్యవివాహలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## లక్ష్మారెడ్డి సేవలు అభినందనీయం

జైనథ్, మార్చి 30 : మేడిగూడ(సీ) కాంప్లెక్స్ హెచ్ఎం పొద్దుటూరి లక్ష్మారెడ్డి విద్యాభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. శనివారం మేడిగూడ(సీ) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సన్మాన సభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్యాభివృద్ధికి ఆయన సేవలు అందించారని తెలిపారు.అనంతరం హెచ్ఎం పొద్దుటూరి లక్ష్మారెడ్డి దంపతులను మేడిగూడ గ్రామస్తులు ఉపాధ్యాయులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, టీటీయూ అధ్యక్షుడు సోగల సుదర్శన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో ముమ్మరంగా తనిఖీలు




లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

భీంపూర్, మార్చి 30 : లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో భీంపూర్, తాంసి, తలమడుగు సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. శనివారం మహారాష్ట్ర సరిహద్దు సమీపంలోని లక్ష్మీపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద అన్ని వాహనాలను తనిఖీ చేశారు. అలాగే భీంపూర్ మండల సరిహద్దు గుబిడి, కరంజి(టీ), తాంసి(కే), గొల్లగడ్, గోవింద్‌పూర్ శివారుల్లో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పెన్‌గంగ ఆవతలి మహారాష్ట్ర గ్రామాల నుంచి దేశీదారు, డబ్బు లాంటివి రవాణా కాకుండా చూస్తున్నారు.

## అటవీ శాఖ అధికారులకు వైద్య పరీక్షలు

కడెం, మార్చి 30 : కడెం రేంజ్ కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు అటవీ శాఖ సిబ్బందికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కడెం ఎఫ్ఆర్వో అనిత, డీఆర్వోలు సిద్ధార్థ, ప్రకాశ్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, మార్చి 30 : ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ శాతం పెరిగేలా శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సి-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సువిధ అనుమతులు జాప్యం లేకుండా నిర్దేశించిన సమయంలోగా అనుమతులు ఇవ్వాలని, ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసి కంట్రోల్ రూం 24 గంటలు పనిచేస్తూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ఓటరు జాబితా సవరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫారాలను పరిష్కరించాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ టౌన్, మార్చి 30: జిల్లాలో ఇంటర్ బోర్డు నిబంధనలను పాటించని కళాశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశి డిమాండ్ చేశారు. శనివారం నిర్మల్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మార్చి 30 నుంచి జూన్ ఒకటి వరకు సెలవులు ప్రకటించిందన్నారు. కొన్ని కళాశాలలు వేసవిలో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. అటువంటి కళాశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అజయ్, వంశీ ఉన్నారు

# సమయపాలన పాటించాలి

ఖానాపూర్ టౌన్, మార్చి 30: ప్రతి అంగన్‌వాడీ టీచర్ సమయ పాలన పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత సూచించారు. శనివారం సీడీపీవో కార్యాలయంలో ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కేంద్రంలో 0-5 ఏళ్ల పిల్లల బరువు, ఎత్తులను రికార్డు చేయాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.